క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పోతునూరు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ

దెందులూరు: పోతునూరు కోఆపరేటివ్ సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్‌పర్సన్ దూళిపాళ్ళ రమాదేవి, ప్రసాద్ ఆధ్వర్యంలో దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత ప్రారంభించారు. పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్ మాట్లాడుతూ సిబ్బంది ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు ఆశీర్వాదం, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, ఎంపీటీసీ సున్నా నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్రాజు సత్యనారాయణ, పార్టీ కార్యదర్శిరమేష్, బీశెట్టి నూకరాజు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

కళాశాలలో అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు



ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్

దెందులూరు: గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు నివేదిక పంపామని వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. శనివారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కళాశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకున్న నేపథ్యంలో వారి ఆదేశాలకనుగుణంగా కళాశాలలో ప్రాధాన్యమైన ట్రాక్, స్టేడియం ఆవశ్యకతను, అంచనాలను నివేదికల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి శనివారం పంపించినట్టు తెలిపారు. అనుమతుల మంజూరు అనంతరం కళాశాలలోని వసతులు విద్యార్థులకు ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ వివరించారు.

రైల్వే అండర్‌పాస్ పనుల ప్రారంభం

దెందులూరు: దెందులూరు- అలుగులగూడెం రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ పనులను శనివారం దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. 90 రోజుల పాటు రైల్వే గేటు మూసివేస్తామని తెలిపారు. అండర్‌పాస్ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేస్తామన్నారు. రైల్వే గేటు మీదుగా ప్రయాణం చేసే రెండు మండలాల ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు. ఆయన వెంట దెందులూరు సొసైటీ డైరెక్టర్ , వైఎస్సార్‌సీపీ నేత మొటపర్తి రాంబాబు ఉన్నారు.

ధాన్యానికి మద్దతు ధర

భీమడోలు: ధాన్యానికి మద్దతు ధరను అందించి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గుండుగొలను సొసైటీ చైర్మన్ వగ్వాల విజయ వెంకటభాస్కర్ అన్నారు. గుండుగొలను సొసైటీలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాళ్వా సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. గోనె సంచులను అందిస్తామని, వారికి మిల్లర్లను కేటాయిస్తామని అన్నారు. కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ అవుతుందన్నారు. సీఈవో జగదీష్, సంఘం పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

17న నారాయణపురంలో జిల్లాస్థాయి స్పందన

ఉంగుటూరు: ఈనెల 17న జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నారాయణపురం కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు కలెక్టరు ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి జరిగే ఈ స్పందన కార్యక్రమానికి జాయింటు కలెక్టరు, జిల్లాస్థాయి అధికార్లు హాజరై అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

పశువైద్యశాలలో రికార్డుల తనిఖీ

పెదపాడు: పశువులకు గాలి కుంటు టీకాలు మోతాదు సక్రమంగా అందించాలని రాష్ట్ర స్థాయి వీబీఆర్‌ఐ సహాయ సంచాలకులు డాక్టరు టీ మోహనాంబ తెలిపారు. శనివారం పెదపాడు శివారు సత్యనారాయణపురంలో జాతీయ గాలికుంటు నివారణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పెదపాడు పశువైద్యశాలను సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వ్యాధినిరోధక టీకాలను, రికార్డులను పరిశీలించారు. సత్యనారాయణపురంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాలను పరిశీలించారు. గాలి కుంటు వ్యాధి టీకాలను వేయడం ద్వారాలు పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించవచ్చునన్నారు. ఏడీటీఎల్ సహాయ సంచాలకులు డాక్టరు ఏ సుచరిత పశువైద్యాధికారి వాణి సంధ్య, ఫణికుమార్ పాల్గొన్నారు.

మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు

ఉంగుటూరు: సచివాలయ వ్యవస్థ ద్వారా 12 శాఖల ఉద్యోగులను అందుబాటులో ఉంచి ప్రజలకు ప్రభుత్వ పరిపాలనను చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వాసుబాబు ప్రారంభించారు. అనంతరం 138వరోజు గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మవద్దని వాసుబాబు అన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ అధికారంలో తెచ్చేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. గొల్లగూడెంలో పేదలందరికీ ఇళ్ల స్థలాల సమస్య త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు ఇంటింటా పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వాసుబాబు వివరించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటశ్రీలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగరావు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, గొల్లగూడెం నాయకులు దాసరి సత్యనారాయణ, మలకలపల్లి వెంకట శివప్రసాదు, ఈగల రమేష్‌కుమార్, కఠారి నర్సింహమూర్తి పాల్గొన్నారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే వాసుబాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. దళితపేటలో మహిళలు వాసుబాబుకు హారతులతో స్వాగతం పలికారు.



గొల్లగూడెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



మత్స్యకారులకు మోటార్‌సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత

గణపవరం: మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వారి అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మత్స్యకారులకు సబ్సిడీపై మోటార్‌సైకిళ్లు, ఫోర్‌వీలర్ వాహనాలను పంపిణీ చేశారు. రూ.64 లక్షల విలువైన మూడు ఫోర్‌వీలర్ వాహనాలకు ప్రభుత్వం రూ.32 లక్షలు సబ్సిడీగా అందజేసింది. నాలుగు టూవీలర్ మోటార్‌సైకిళ్లకు రూ.1.30 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా ఇచ్చినట్లు మత్స్య అభివృద్ధి అధికారి మంగారావు తెలిపారు. ఈ సందర్భంగా జెండా ఊపి ఫోర్‌వీలర్ వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, పూళ్ల సర్పంచ్ దాయం సుజాత, ఎంపీటీసీ బొల్లారపు జ్ఞానరమ్య, గొండు చైతన్య , తాడి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

భారతరత్న బీఆర్ అంబేడ్కర్ సేవలు మరవలేం

భీమడోలు: సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపిన మహోన్నత వ్యక్తి భారతరత్న అంబేడ్కర్ సేవలను మరువలేమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. చెట్టున్నపాడులో శుక్రవారం రాత్రి భారతరత్న, బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ప్రణాళిక శాఖ సీఈవో విజయకుమార్ పాల్గొన్నారు. అనంతరం గ్రామ పెద్దలు, యువకులు వారిని ఘన సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, సర్పంచ్ జల్లూరి వెంకట నరసమ్మ, ఎంపీటీసీ ఓనమాల సుజాత, మండల కన్వీనర్ రావిపాటి సత్య శ్రీనివాస్, పెద్దలు సుధీర్, కరుణాకర్, ఓరా జయరాజు, బుంగా జయరాజ్, నియోజకవర్గ జగన్‌సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పసుపు రంగు తొలగింపు



అంబేడ్కర్ విగ్రహం, స్తంభాలకు పసుపు రంగు తొలగించిన దృశ్యం

దెందులూరు: మండలంలోని జోగన్నపాలెంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, చుట్టూ నాలుగు ఇనుప స్తంభాలకు పసుపు రంగు వేయడంపై విమర్శలు వెల్లువెత్తడంతో టీడీపీ నాయకులు దిద్దుబాటు చర్యలు చేపట్టి రంగు మార్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా తెలుగుదేశం నాయకులు సంకుచిత ఆలోచనతో పసుపు రంగును వేశారు.దీనిపై వైఎస్సా ర్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిళ్ళెం శ్యాం తంబి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్, సర్పంచ్ కూరపాటి ప్రభుదేవ ఆధ్వర్యంలో జోగన్నపాలెం సర్పంచ్ ఇల్లు ముట్టడికి పిలుపునిచ్చారు. మాలమహానాడు, వైఎస్సార్ సీపీ సంయుక్తంగా ఇచ్చిన పిలుపునకు స్పందించి దెందులూరు ఎస్సై వీర్రాజు అప్రమత్తమయ్యారు. టీడీపీ నాయకులకు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో నాలుగు స్తంభాలకు అంబేడ్కర్ విగ్రహంలోని టైకు వేసిన పసుపు రంగును తొలగించి వేరే రంగులు వేశారు.

పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద సందడి

గణపవరం: గణపవరం మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. మండలంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 847 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాశారు. పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో ఈఏడాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మాస్‌కాపీయింగ్‌కు ఏమాత్రం అవకాశంలేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంఈవో పుచ్చల శేషు, గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు తదితరులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద గణపవరం, పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈఏడాదికూడా పదోతరగతిలో 6 పేపర్లతోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. శనివారం సోషల్ పరీక్షతో పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలతో , పరస్పర అభినందనలలో పరీక్షా కేంద్రాల వద్ద సందడి చేశారు. సోమవారం కొన్ని పరీక్షా కేంద్రాల్లో సంస్కృతం, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.



కాశిపాడు పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థుల కేరింతలు



గుండుగొలనులో హాస్టల్ బాలికల ఆనందం

పరీక్షలు ముగిసిన వేళ.. ఆనంద హేల

భీమడోలు: పదో తరగతి పరీక్షలు సోమవారం ముగియడంతో విద్యార్థులు ఆనందడోలికల్లో మునిగితేలారు. మండలం పరిధిలో ఎక్కడా ఒక్క మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు. మండల వ్యాప్తంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక, పోలసానిపల్లి గురుకులాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 908 మంది పరీక్షలు చేసారు. భీమడోలు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. పోలసానిపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులకు ఆర్టీసీ బస్సుల్లో తీసుకుని వెళ్లి తీసుకొచ్చారు.

కోమర్రులో వైభవంగా అమ్మవార్ల జాతర

గణపవరం: జాతరలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, తరతరాలుగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం గణపవరం మండలం కోమర్రు గ్రామ దేవతలు పద్దాల వెంకమ్మ, మారెమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు, మండలాధ్యక్షుడు అర్ధవరం రాములకు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ తూము వీరవేణి, ఎంపీటీసీ సభ్యురాలు వడ్డి సీతామహాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు వడ్డి ఉమ, గ్రామస్తులు పాల్గొన్నారు. అమ్మవార్లకు ఆసాదులు గరగల సేవ నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను గ్రామంలో వైభవంగా ఊరేగించారు. విచిత్రవేషాలు, బాణసంచా కాల్పులు, శక్తివేషాలు, బ్యాండుమేళాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బుట్టబొమ్మలు, డప్పువాయిద్యాలతో అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. జాతర సందర్భంగా గ్రామానికి చెందిన ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామం కళకళలాడుతోంది.



కోమర్రులో ఎమ్మెల్యే వాసుబాబుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఇంటింటా సంక్షేమ పథకాలు

దెందులూరు: ప్రతి గడపలోనూ లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని, ఇంటింటా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఎంతో తృప్తిగా ఉన్నామని లబ్ధిదారులు తమతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టాలీలానవకాంతం అన్నారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న పథకాలు సమర్థవంతంగా పూర్తిస్థాయిలో కొనసాగేందుకు మరోసారి వైఎస్సార్‌సీపీకి ప్రజలందరూ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారనేది గడపగడపలో ప్రజాస్పందన తెలుస్తోందన్నారు. శనివారం కొవ్వలిలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు కాటి సుధాకర్, సర్పంచ్ ఇంటేటి మధులతా గంగాధర్, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, జిల్లా కార్యదర్శి గొల్ల వీరాస్వామి, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటా జగనన్నే మా భవిష్యత్తు సర్వే నిర్వహించారు. గోపన్నపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్ హేమసాగర్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, కొండేటి గంగాధరబాబు, తోట పద్మారావు, మోర్ల సుబ్బారావు పాల్గొన్నారు. దెందులూరులో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, పార్టీ నాయకులు తొత్తడి కృష్ణ, ఐనంపూడి రాము తదితరులు సర్వే నిర్వహించారు. కుటుంబ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేయడంతో జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గృహసారథులు నిర్వహిస్తున్నారు.



గోపన్నపాలెంలో జగనన్నే మా భవిష్యత్తులో పాల్గొన్న జెడ్పీటీసీ లీలానవకాంతం, సర్పంచ్



సరిపల్లెలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

గణపవరం: గణపవరం మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ముప్పర్తిపాడు, మొయ్యేరు, పిప్పర, గణపవరం, వరదరాజపురం, జల్లికొమ్మర, వల్లూరు, సరిపల్లెలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజామద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలు జవాబులు రాసుకున్నారు. పథకాల లబ్ధిదారులందరూ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల అనుమతితో ఇంటి గోడలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు.

పెరుగుతున్న జ్వర బాధితులు

పెదవేగి : నియోజకవర్గంలో ప్రతి ఇంటా జ్వరం లేదా దగ్గు, జలుబు బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నారు. సహజంగానే ఈ సీజన్‌లో వ్యాధుల వ్యాప్తి చెందుతాయి. ఇప్పటికే కరోనా కేసులు జిల్లాలో పలు చోట్ల నమోదవుతున్న తరుణంలో జ్వర బాధితులు కలవర పడుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులున్న వారికి సహజంగానే జలుబు, జ్వరం రావొచ్చని అధైర్య పడొద్దని వైద్యులు అంటున్నారు. వైద్య సిబ్బంది నిర్దేశించిన సూచనలు పాటించాలని వారంటున్నారు. జ్వరం, దగ్గు వంటివి రెండు రోజులు దాటి ఉంటే కోవిడ్ నిర్ధారణ పరీక్ష చేయించాలని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారి పి పూర్ణిమ అన్నారు. పాజిటివ్ వస్తే భయపడాల్సిన పని లేదని, హోం ఐసోలేషన్లో ఉంటూ ప్రభుత్వం అందించే కోవిడ్ కిట్ వాడుతూ, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ఎంపీడీఓ జి. రాజ్‌మనోజ్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉన్నామన్నారు. కరోనా నియంత్రణకు చర్యలతో పాటు, దోమల నివారణకు, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు అందజేశాయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.



వేగివాడలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



ఎత్తైన ప్రదేశాల్లో జెడ్ పరికరాలతో మంటలను ఆర్పే విధానం



తక్కువ ఎత్తులోని పొగ, మంటలను అదుపు చేసే విధానంపై మాక్ డ్రిల్

భీమడోలు: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలపై జాతీయ రహదారి భీమడోలు జంక్షన్ వద్ద ఆశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రయోగాత్మక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పైపులను వినియోగించి అగ్నిప్రమాదాల నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భీమడోలు అగ్నిమాపక అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది పొగ మంటలు వ్యాప్తించిన సమయంలో, రసాయనాలు, ఆయిల్ అగ్నిప్రమాదాలు, మంట తక్కువ, పొగ విస్తరించిన తరుణంలో ఎత్తైన ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్ని ప్రమాదాలు నియంత్రించడంపై సిబ్బంది అనుసరించే విధానాలపై ప్రదర్శించిన యంత్ర పరికరాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఫైర్ అధికారి జి.నాగరాజు మాట్లాడుతూ అప్రమత్తతతోనే ప్రమాదాలు నివారణ సాధ్యమని అన్నారు.

విద్య ద్వారా జ్ఞానం వృద్ధి

పెదవేగి : గురువులు మార్గదర్శకులు అని, విద్య ద్వారా జ్ఞానం వృద్ధి చెందుతుందని యజ్ఞవల్క్య రాజా శ్రమం అభినవ వివేకానంద శ్రీకృష్ణ చరనానంద భారతి స్వామిజీ అన్నారు. పెదవేగి మండలం ముండూరు క్షేత్రంలోని యజ్ఞవల్క్య రాజా ఆశ్రమంలో 65వ వార్షికోత్సవ మహా సభలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ చరనానంద భారతి స్వామి మాట్లాడుతూ శనివారం నుంచి మూడు రోజులపాటు వేదాంత మహాసభలను నిర్వహిస్తామన్నారు. ఈ దివ్య కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి జ్ఞాననిధులైన పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులైన సాధు మహాత్ములు వేదాంత మహాసభల్లో పాల్గొని వారి దివ్యమైన బోధనలను అందిస్తారని ఆయన అన్నారు. మొదటి రోజు వేదాంత సభలో పలువురు స్వాములు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో అవధూత స్వరూపానంద గిరి స్వామి, పరమానంద గిరి స్వామి, ప్రతిష్టానంద సరస్వతి స్వామి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీఎస్‌ఆర్ చౌదరి, రామానంద స్వామి భక్తులు పాల్గొన్నారు.



యజ్ఞవల్క్య రాజాశ్రమంలో ప్రసంగిస్తున్న శ్రీకృష్ణ చరనానంద భారతి స్వామి

చదువులో రాణించాలి

పెదవేగి : ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ చెప్పారు. శనివారం పెదవేగి మండలం పినకడిమి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రాయన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ తనిఖీలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ నక్షత్ర పూజలు

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రావణ నక్షత్ర పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేషంగా అలకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, ఈవో డి.శంకరరావు, పూజరులు రవి, సాయి, భక్తులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

పెదవేగి : ప్రజల దాహార్తిని తీర్చి సేదతీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని విజయరాయి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పెదవేగి మండలం విజయరాయి ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండలంలో నేటి వరకు 11 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ చెప్పారు. ఉపసర్పంచ్ లేగల శివ, స్థానిక నాయకులు పులగం వేణుగోపాల్‌రెడ్డి, ముత్తనవీడు సచివాలయ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు. నడిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ మేకా అప్పాయమ్మ శనివారం ప్రారంభించి ప్రజలకు మజ్జిగ, కూల్‌డ్రింక్స్ అందించారు.

బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

భీమడోలు: భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాలి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమడోలులో శనివారం 23-24 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఎన్నికల అధికారిగా ఇంజేటి విజయ్ అచ్యుతం వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా గొటికల వరప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా బోడిగడ్ల రాంబాబు, కోశాధికారిగా ఇంజేటి విజయ్ అచ్యుతం, కార్యదర్శిగా బీవీడీఎల్ నారాయణ, సంయుక్త కార్యదర్శి వీరమళ్ల రాంబాబు, మహిళా ప్రతినిధిగా లావేటి సుధారాణిలు, ఇతర సభ్యులు ప్రమాణం చేసారు. పూర్వం పని చేసిన వారిని ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

పెదపాడు: గృహనిర్మాణాలు నత్తనడకన సాగడంతో అధికారులపై జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు మండిపడ్డారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో జిల్లా పంచాయతీ అధికారి మండల ప్రత్యేక అధికారి జీవీకే మల్లికార్జునరావు స్థానిక లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు స్థానిక అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కొక్కిరపాడులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

పోలీసులను బెదిరించడం దుర్మార్గం

దెందులూరు: ప్రజల్లో టీడీపీ పట్ల విశ్వాసం కోల్పోయి ఒక పక్క, మరో పక్క పుత్ర రత్నం లోకేష్ ఆంధ్రాతో పాటు కర్ణాటక సైతం పాదయాత్ర చేస్తూ ప్రజలను, పార్టీ శ్రేణులను గందరగోళంలో పడేయడంతో దిక్కుతోచని స్థితిలో చంద్రబాబు పోలీసులను బెదిరించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి నాని ఎద్దేవా చేశారు. శనివారం శ్రీరామవరంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూజివీడు డీఎస్పీని బహిరంగ సమావేశంలో శుక్రవారం రాత్రి త్వరలోనే నీ సంగతి తేలుస్తానని చంద్రబాబు బెదిరించడం దుర్మార్గమన్నారు.